# 'మే గాడ్ బ్లెస్ యూ'

- పి. నిర్మల

**"ఓహో అదా! అవునవును. మా టీచరు గూడా 'మే గాడ్ బ్లెస్ యూ' అంటారమ్మా!" అన్నాడు బాబు.**

**"ఆ! అదే రా!" అని నేను అన్నాను.**



ఒక రోజు నేను మొక్కలకు నీరు పెడుతున్నాను. బాబు వచ్చి "ఏమిటమ్మా! ఎప్పుడూకాయల చెట్లేనా?" అని అన్నాడు. "మరేం మొక్కలు వెయ్యమంటావురా?" అని అడిగేను. వాడు గారాలు పోతూ "అమ్మా! ఈ సారి పువ్వుల మొక్కలు వెయ్యవే" అన్నాడు.

"ఏంరా, ఇక నుండి జడ వేసుకొని పువ్వులు పెట్టుకుంటావా ఏం?" అన్నాను.

"ఛీ పోవే! అది కాదే అమ్మా! ఇక నుండి పువ్వుల మొక్కలు పెంచుదామే" అని మారాం చేసాడు. నేను సరే అనేవరకు వదల్లేదు. వీడికెందుకు పువ్వుల మొక్కలపై ఇంత శ్రద్ధ కలిగిందో నాకు అర్థం కాలేదు. అప్పటికి వీడిని సమాధానపరచడానికి సరే అని వంటింట్లోకి వెళ్ళిపోయాను.

టైమయిపోతోంది కదాని త్వరత్వరగా హడావిడిగా వంట కానిస్తున్నాను. మా వాడు "అమ్మా! అమ్మా!" అంటూ బయట నుండి కేకలు పెడుతున్నాడు. ఏమిటా సంగతని బయటకు వెళ్ళి చూస్తే విరిగి పోయిన కుండీలో గులాబీ మొక్కలతో నిలబడ్డాడు. నన్ను చూడగానే "ఇవి పాతిపెట్టవే అమ్మా, పై ఆంటీ వాళ్ళ పూలకుండీ విరిగిపోతే మనకిచ్చేసారు..." అంటూ చెప్పుకుపోతున్నాడు బాబు. చక్కగా వున్న మొక్కలు అందులో గులాబీ మొక్కలు ఇస్తుంటే వద్దనడమెందుకని తెచ్చాను. టైమయిపోతున్నా త్వర త్వరగా గొప్పులు తవ్వి నాటేను. నేను మొక్కలు నాటుతుండగా మా వాడి మొఖంలో అపరిమిత ఆనందం చూసి 'వీడికీ మధ్య పువ్వుల మీద మనస్సు పోయిందెందుకో' అని నవ్వుకున్నాను.

ఆ రోజు మొదలుకొని బాబు ఎప్పుడు చూసినా మొక్కలకు నీళ్ళు పోస్తూనో, వాటిని పరీక్షిస్తూనో కనిపిస్తున్నాడు. వాడి శ్రద్ధ చూచి నేను కూడా దానికి ఉల్లిపాయ తొక్కు, టీ వడపోసిన గుండ శ్రద్ధగా వెయ్యడం మొదలుపెట్టాను. ఆ సాయంత్రం బయట చాలా మంది పిల్లల గొడవ విని కిటికీలో నుండి తొంగి చూస్తే మా వాడు వాడి క్లాస్‌మేట్సును తీసుకొచ్చి సంతోషంగా ఏదో వర్ణించి చెబుతున్నాడు. వీడు ఏదో ప్రపంచ వింత చూపిస్తున్నట్టుగా ఆ పిల్లలు కళ్ళు వెడల్పు చేసి ఆసక్తిగాను, అమాయకంగాను వింటున్నారు. వాడు నన్ను చూడగానే నా దగ్గరకు పరుగెత్తుకొని వచ్చాడు. ఏమిటిరా హడావిడి చేస్తున్నావని అడిగితే, "నా గులాబీ మొక్క మొగ్గ తొడిగిందిరా కదా! చూపిద్దామని మా ఫ్రెండ్సుని తీసుకొచ్చాను" అన్నాడు గొప్పగా.

అంతలోనే "అమ్మా! ఇది ఏ రంగు పువ్వు పూస్తుందే?" అని ప్రశ్నించాడు. రోజ్ కలర్ గులాబీలు పూస్తాయని చెప్పగానే వెళ్లిపోయాడు. ప్రతి క్షణం వాడి దృష్టి అంతా పువ్వు మీదనే వుంటోంది. మొగ్గ విరియడం మొదలుపెట్టగానే నా దగ్గరకు పరుగెత్తుకు వచ్చి "అమ్మా రేపటికి నా పువ్వు పూస్తుందే?" అని అన్నాడు.

"ఒరే! నీ పువ్వులు, మొక్కలు బాగానే వున్నాయి గాని వీటి ధ్యాసలో పడి నీ చదువు సంత కెళ్ళిందిరా. ఇహ మొక్కల పిచ్చి కట్టిపెట్టి చదవకపోయావా తంతాను. అసలు నువ్వు హోంవర్కు సరిగా చేస్తున్నావా?" అని దెబ్బలాడాను.

ఆ రోజు రాత్రంతా వాడు మర్నాడు పూయబోయే పువ్వు గురించి వాళ్ళ నాన్నగారికి కబుర్లు చెబుతూ నిద్రపోయాడు. తెల్లవారింది. నా పనిలో మునిగి నేనున్నాను. ఇంతలో బేరుమని ఏడుస్తూ మావాడు వచ్చాడు. ఉదయానే వాడి ఏడుపు చూచి నాకు చిర్రెత్తింది, "ఏరా! ఏం కొంప మునిగిందని పొద్దుటే రాగాలాపన మొదలు పెట్టావ్?" అని విసుక్కున్నాను.

ఏడుస్తూనే, "అమ్మా! నా పువ్వు ఎవరో కోసేసారే" అని చెప్పాడు. పోతే పోయిందిలే, పొద్దుటే ఇంట్లో ఏడవకని కసిరి యింట్లోకి వెళుతుంటే ఈలోగా పక్కింటి ఆవిడ వచ్చి "ఏమండీ వదినగారూ! మేము పెళ్ళికి వెళుతున్నాము. పాలు వస్తే తీసుకుని కాచి తోడు వెయ్యండి" అని వెళ్ళబోతున్నారు. ఆవిడని చూచి బాబు మరీ గట్టిగా ఏడవడం మొదలుపెట్టాడు. నేను ఆశ్చర్యపోయాను ఆవిడ పెళ్ళికి వెడుంటే వీడు ఎందుకు ఏడుస్తున్నాడా అని!

"అమ్మా, ఇదుగోవే నా పువ్వు. ఆంటీ పెట్టేసుకొన్నారే" అని రాగం పెద్దది చేశాడు.

"పోనీలేరా బాబు, తప్పు, ఊరుకో." అని వాడిని లోపలికి తీసుకుపోయాను. ఆవిడ సిగ చుట్టూ కనకాంబరాలు పెట్టుకుని అవి చాలవన్నట్టు వీడి పువ్వు కూడా కోసుకుని పక్కన పెట్టుకుంది. వీడు ఏడుపు ఆపడు.

"ఏమిటిరా నాయనా పువ్వు కోసం ఆడపిల్ల లాగ ఏడుస్తున్నావే?" అని కసిరితే, "అది కాదే అమ్మా! టీచర్‌కి యిస్తే 'మే గాడ్ బ్లెస్ యూ!' అంటారు కదా! మరి నాన్నగారు చెప్పేరు గదా? గురువు అనుగ్రహం పొందాలని పిల్లలు రోజూ పువ్వులుతెచ్చి టీచరు బ్లెసింగ్స్ చక్కగా తీసుకుంటున్నారు. నన్నూ టీచరు మెచ్చుకోవాలని యిన్నాళ్ళ నుంచి ఎదురు చూస్తున్నాను. ఇవాళ పువ్వు కోసి టీచరుకి యిచ్చి 'మే గాడ్ బ్లెస్ యూ' అనిపించుకుందామంటే... యీ ఆంటీ..." పాపం వెక్కిళ్ళు అడ్డుపడి మాట రావడం లేదు.

అది వినగానే నాకు గుర్తొచ్చింది కొన్ని రోజుల క్రితం మావారు 'గురువాణి' చదువుతున్నారు. నేను, బాబు కూడా వింటున్నాము. ఒక చోట "నాన్నగారూ దీని అర్థం ఏమిటండి" అని బాబు అడిగాడు.

"మానవునికి గురువు అనుగ్రహం వుండాలి. గురువు ఆగ్రహానికి గురి కాకూడదు. గురువు అనుగ్రహం కలిగితే ఈ లోకంలో పొందలేనిదేమీ వుండదు" అని చెప్పారు.

"అనుగ్రహం అంటే ఏమిటి?" అని ప్రశ్నించాడు వాడు.

"అనుగ్రహం అంటే కృప, దయ, ఆశీర్వాదం" అన్నారు వారు.

"అంటే ఏమిటి నాన్నగారు?" అని మరల ప్రశ్నించాడు.

ఈ కాలం పిల్లలు ఇంగ్లీషు మీడియం స్కూళ్ళలో చదవడం కాదు కాని తెలుగు ఒక పట్టాన అర్థం కాదు. అపుడు నేను "ఆశీర్వాదం అంటే బ్లెసింగ్ రా" అన్నాను. అప్పుడు బాబు అన్నాడు- "ఓహో! అదా! అవునవును, మా టీచరు కూడా 'మే గాడ్ బ్లెస్ యూ' అంటారమ్మా!"

అదంతా ఆలోచిస్తూ వుండిపోయాను నేను. నిజంగా వాడి ఆరాటం తెలుసుకోలేక, ఆ పసి మనసును ఎంత గాయపరచాను! అనవసరంగా ఎందుకు కసిరాను అనుకుంటూ వుండిపోయాను.

*